సాక్షి చిత్తూరు

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



ప్రైవేటు బస్సు బోల్తా

పాలమూరు సమీపంలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటనలో 22 మంది గాయపడ్డారు. - IIలో



ఎర్రమట్టి.. కొల్లగొట్టి

చౌడేపల్లి మండలంలోని చెరువుల్లో మట్టి. ఇసుక డంప్ చేసినా అధికారులకు కనపడడం లేదు. - IIలో



ఆదిశక్తి అలంకరణలో వరాలతల్లి

దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం అమ్మవారు ఆదిశక్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. - IIలో

న్యూస్‌రీల్

గంజాయిపై ఉక్కుపాదం



పుంగనూరు : ఫిర్యాదుదారులతో ఎస్పీ

పుంగనూరు : గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, పాఠశాలలు, కళాశాలల సమీపంలోని 500 మీటర్ల దూరంలో గల షాపులపై ప్రత్యేక నిఘా పెట్టి తగు చర్యలు చేపడుతామని నూతన ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. బుధవారం ఆయన పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి, వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను మంచిగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ సుబ్బరాయుడు, ఎస్‌బీ సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐలు హరిప్రసాద్, రమణ పాల్గొన్నారు.

త్వరితగతిన నియామక ప్రక్రియ చేపట్టండి

చిత్తూరు కార్పొరేషన్ : కారుణ్య నియమాకానికి జెడ్పీలో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుడు అరుణ్‌కు త్వరితగతిన నియామక ప్రక్రియను పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో కారుణ్య నియామక ప్రక్రియ పురోగతిని తెలుసుకునేందుకు నిరీక్షిస్తున్న దివ్యాంగుడు అరుణ్‌ను జెడ్పీ చైర్మన్ పలకరించి సమస్యను అడిగి తెలుసుకున్నారు.దివ్యాంగుడికి అందాల్సిన ఫ్యామిలీ పెన్షన్, ఉద్యోగ ప్రక్రియను ఈ నెల 29 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.



ధ్వజారోహణలో వేదపండితులు





ఆలయంలో ఉపరాష్ట్రపతి



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం

● వి'శేష' విహారం

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని వైభవంతో తిరుగిరులు విరాజిల్లుతున్నాయి. బ్రహ్మోత్సవ శోభతో దేదీప్యంగా కాంతులీనుతున్నాయి. ధ్వజ పటం తేజస్సుతో నూతన వెలుగులను సంతరించుకున్నాయి. గోవిందనామస్మరణలతో మార్మోగుతున్నాయి. ఈ క్రమంలోనే ఏడు పడగల పెదశేషునిపై విహరిస్తున్న వైకుంఠ నాథుని వీక్షించి భక్తజనులు పరవశించారు. ఉభయ దేవేరీ సమేతంగా ఊరేగుతున్న మలయప్పస్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలను సమర్పించారు. ఏడుకొండలస్వామివారిని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ భక్తిశ్రద్ధలతో సేవించుకున్నారు. – తిరుమల



పెదశేషవాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారు

జిల్లాలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. దొంగ బిల్లులతో సరిహద్దులు దాటుతోంది. ఈ దోపిడీకి అడ్డుకట్టపడనంటోంది. కొత్తగా దోపిడీలో బ్లేడ్ బాబ్జీల గ్యాంగ్ తెరపైకొచ్చింది. సాక్షిలో వస్తున్న వరుస కథనాలతో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆ దొంగ బిల్లుల దొర ఎవరంటూ.. జిల్లా యంత్రాంగం ఇప్పుడు జల్లెడ పడుతోంది. ఈ గ్రానైట్ మాఫియాపై కూటమిలోని మరోవర్గం విభేదిస్తోంది. మాఫియాకు వ్యతిరేకంగా జట్టుకడుతోంది. మాఫియా వ్యవహారాన్ని అధిష్టానానికి చేరవేసినట్లు తెలుస్తోంది.



ఎవరా... దొంగ బిల్లుల దొర!

- జిల్లాలో అడ్డగోలుగా మైనింగ్ వ్యాపారం
- కొత్తగా గ్రానైట్ తవ్వకాలకు పూజలు
- దొంగ బిల్లులతో గ్రానైట్ అక్రమ రవాణా
- జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ
- భగ్గుమంటున్న కూటమి నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లాలో 400 పైగా క్వారీలు నడుస్తున్నాయి. అక్రమంగా 100కు పైగా నడుస్తున్నాయి. వీటి నుంచి ప్రతి రోజు రూ.కోట్ల విలువైన ఖనిజం బయట పడుతోంది. ఇవి రాష్ట్రంలోని పలు జిల్లాలకు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడా అమ్ముడుబోతున్నాయి. ఇందులో కొంత వరకు మాత్రమే రైట్ రాయల్‌గా వెళుతున్నాయి. చాలా వరకు బిల్లులు లేకుండా సరిహద్దులు దాటుతున్నాయి. ఈ మధ్యలో దొంగ బిల్లులతో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. ఇదంతా కూటమి నేతలు మాఫియాగా ఏర్పడి చేస్తున్న దందా అంటూ కూటమిలోని మరో వర్గం మండిపడుతోంది.

విచ్చలవిడిగా అక్రమ క్వారీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో అక్రమ క్వారీలు గుట్టు చప్పుడు కాకుండా వెలిశాయి. తర్వాత గ్రానైట్ తవ్వకాలకు పలు గ్రామాలు వణకుతున్నాయి. పాలసముద్రం, వెదురుకుప్పంలో గ్రానైట్ మాఫియా దౌర్జన్యంతో ప్రజలు రోడ్డెక్కారు. చిత్తూరు, బంగారుపాళ్యంలోని పాలేరు, జంభువారి పల్లిలో జరుగుతున్న అక్రమ క్వారీ దాహానికి కొండలు బద్దలవుతున్నాయి. అధికార పార్టీ అండతో ఆ క్వారీపై నోరు విప్పేందుకు ప్రజలు జంకుతున్నారు. యాదమరిలో వెంకటాపురం సమీపంలోని అడవిలో గ్రానైట్ తవ్వకాలకు పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో దొంగ బిల్లుల వ్యవహారం మరింత విస్తరిస్తోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీటి నుంచి కొంత మంది అధికారులకు మామూళ్లు ముడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

బాగోతంపై ఆరా

మైనింగ్ మాఫియా బాగోతం సాక్షి కథనాలతో బట్టబయలైంది. ఈ అక్రమ బాగోతం నడిపిస్తూ రారాజుగా పేరుపొందిన ఆ దొర ఎవరంటూ పలువురు ఆరా తీస్తున్నారు. చిత్తూరు కేంద్రంగా నడుస్తున్న ఈ మాఫియాను ఇంతలా ఎలా నడిపిస్తున్నారనే ప్రశ్నలు ప్రతి ఒక్కరిలోనూ మొదలువుతున్నాయి. కోట్లకు పడగలెత్తుతుంటే కూటమిలోని సీనియర్లంతా అవాక్కువుతున్నారు. మేమంతా పార్టీకి కష్టపడితే...దిష్టిబొమ్మలా షో ఇచ్చేవాళ్లకి ఈ దొంగబిల్లుల పెత్తనం ఏంటని వారు మండిపాటుకు గురవుతున్నారు. కష్టపడేవారికి కోర్కెలతోనే చంపేస్తూ....షో ఇచ్చేవాళ్లకు కోట్లు కట్టబెడుతున్నారా అంటూ ఆగ్రహానికి గురవుతున్నారు. ఇక పోలీసు, మైనింగ్, సేల్స్ ట్యాక్స్, రవాణా శాఖ అధికారులు సైతం ఈ మాఫియా వ్యవహారంపై లోతు విచారణ చేస్తున్నారు. ఈ వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపే పనిలో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మాఫియాపై నిఘా

జిల్లాలో జరుగుతున్న మైనింగ్ మాఫియా, వసూళ్ల పర్వంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. సాక్షిలో వరుసగా ప్రచురితమైన కథనాలపై స్పందించారు. అక్రమాల గనుడు కథనంతో లోతు విచారణకు ఆదేశించారు. ఇందుకు ఓ కమిటీని నియమించారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలతో కూడిన కమిటీ నియమించి మైనింగ్ మాఫియాపై నిఘా పెట్టారు. మళ్లీ ఆదివారం ప్రచురితమైన గ్రానైట్ రైట్ రైట్, సోమవారం ప్రచురితమైన మైనింగ్ మాఫియా అక్రమాలు ఆపరయా అనే కథనాలకు కలెక్టర్ స్పందించినట్లు తెలిసింది. మైనింగ్ మాఫియాపై వివరాలు అడిగినట్లు తెలిసి వచ్చింది. త్వరలో దీనిపై కమిటీతో చర్చించినట్లు తెలిసింది. ఇంతలో లోతు విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆయన ఆదేశించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

తెగిస్తున్న బ్లేడ్ బాబ్జీలు

మైనింగ్ మాఫియాలో దొంగబిల్లులు వ్యవహారం అల్లుకుపోయింది. ఈ వ్యవహారం వెనుక మరో గ్యాంగ్ ఉందని విచారణలో తేలింది. గ్యాంగ్‌కు కొందరు కూటమి నేతలు బ్లేడ్ బాబ్జిలుగా నామకరణం చేశారు. వీరంతా బైక్‌లపై సవారీ చేస్తూ మైనింగ్ మాఫియాను రక్షణ కవచంలా కాపాడుతున్నారు. సొంత క్వారీ నుంచి బండి బయలుదేరినప్పటి నుంచి గమ్యం చేరే వరకు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అలాగే వేరే గ్రానైట్ వాహనాలు కంట పడితే కన్నం వేస్తున్నారు. మళ్లీ ఫ్యాక్టరీలను చుట్టుముడుతున్నారు. అక్కడ బ్లేడులను లెక్కకట్టి బ్లేడుకు రూ. 40 వేల చొప్పున్న వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇలా 1500 ఫ్యాక్టరీల నుంచి రూ.15 కోట్ల వరకు దోచుకున్నట్లు కూటమి నేతలే అధిష్టానానికి తీసుకెళ్లారు. రాయల్టీ పేరుతో రూ.30 కోట్ల వరకు దొర చెంతకు చేరుతున్నట్లు వారు అధిష్టానం చెవిలో వేసినట్లు తెలిసింది. కాగా ఈ అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని తొక్కి పెట్టేందుకు పలువురు పావులు కదుపుతున్నారు. అయితే బ్లేడ్ బాబ్జిలకు దొర అండగా నిలుస్తారని సొంత పార్టీ నేతలే వాదిస్తున్నారు. ఇలా అక్రమంగా సంపాదించిన సొమ్ముతో రారాజుగా పేరొందిన దొర అందరిని మురిపించి మేయర్ కుర్చీకి ఎత్తులు..పై ఎత్తులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

కేబుల్‌వైర్ల చోరీ దొంగ పట్టివేత

చౌడేపల్లె : వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ తీగలు చోరీ చేసే నిందితుడు బీట్ పోలీసులకు జంగాలపల్లె వద్ద పట్టుబడిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది.స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి చారాల మార్గంలో కానిస్టేబుళ్లు మునిరాజ, శ్రీనివాసులు బైక్‌పై చారాలకు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు సంచిలో వైర్లతో వెళ్తుండగా గమనించిన కానిస్టేబుళ్లు జంగాలపల్లె మార్గంలో ఛేజింగ్ చేశారు. పట్టుబడిన దొంగల్లో పుంగనూరు మేలిపట్లకు చెందిన గంగాధర్ పట్టుబడగా మరొక దొంగ పరారైయ్యాడు. వారి వద్ద గల సుమారు 500 మీటర్ల కేబుల్ వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఎక్కడెక్కడ చోరీ చేశారు..? ఎక్కడ విక్రయిస్తున్నారు అనే కోణంలో పోలీసులు ఆరా తీశారు. కాగా దొంగను పుంగనూరు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

జేడీవీగా ఉమామహేశ్వరి బాధ్యతల స్వీకరణ



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీగా ఉమామహేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు నగరంలోని కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించగా పలువురు కలిశారు. అనంతరం శాఖ అధికారులతో చర్చించారు. పాడి పరిశ్రమలో ఎదురవుతున్న సమస్యలపై ఆరాతీశారు.

పకడ్బందీగా ఓటరు జాబితా కసరత్తు



ఎన్నికల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎన్నికల గోడౌన్‌ను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2002 ఓటరు జాబితాలో 2025 ఓటరు జాబితాను సరిపోల్చే కార్యక్రమం జిల్లాలో చేపడుతున్నామన్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో ఈనెల 19 నుంచి 26 వరకు నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు 25 శాతం ఓటరు జాబితా సరిపోలిందన్నారు. ఈ ప్రక్రియలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో బోగస్, మృతిచెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. పారదర్శకమైన ఓటర్ జాబితాకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర పాల్గొన్నారు.

ఖాకీచకుడు

- బాధితురాలిపై పోలీసుల లైంగిక దాడి?
- కానిస్టేబుల్‌ను కాపాడేందుకు ప్రయత్నాలు
- ఎస్పీని కలిస్తేగానీ ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు



పలమనేరు : ప్రజలను కాపాడాల్సిన పోలీసులే నిందితులుగా మారి ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన జిల్లాలోనే కలకలం రేపుతోంది. పలమనేరు పట్టణంలోని గంటావూరు కాలనీకి చెందిన ఓ మహిళపై కానిస్టేబుల్ అడవిలో లైంగిక దాడి చేసిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది.

అసలు ఏం జరిగిందంటే....

గంటావూరుకు చెందిన ఓ మహిళకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త వేధింపులతో ఆమె నాలుగు నెలల క్రితం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. బాధితురాలు అందంగా ఉందని కన్నేసిన అక్కడి సీఐ డ్రైవర్‌గా పనిచేస్తున్న హోంగార్డు కిరణ్‌కుమార్ ప్లాన్ చేశాడు. (ప్రస్తుతం సోమలలో పనిచేస్తున్నాడు.) ఫిర్యాదులోని ఫోన్ నంబరును తీసుకుని తాను న్యాయం చేస్తానంటూ బాధితురాలికి రాత్రుల్లో ఫోన్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో బాధితురాలు తనకు తెలిసిన వారి ద్వారా పలమనేరులో పనిచేసే మరో కానిస్టేబుల్ ఉమాశంకర్‌కు (ఇప్పుడు పుంగనూరులో విధులు నిర్వహిస్తున్నాడు.) తన బాధను తెలుపుకుంది. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆ కానిస్టేబుల్ కూడా నేరుగా బాధితురాలి ఇంటికెళ్లి ఎలాంటి సమస్య లేకుండా చూసుకుంటానంటూ నమ్మబలికాడు. ఆపై అతడు కూడా రాత్రుల్లో ఫోన్‌లు చేయడం మొదలు పెట్టాడు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు దేవుడెరుగు ఆ ఇద్దరి వేధింపులతో ఏం చేయలేని బాధితురాలు తీవ్రంగా మనోవేదన అనుభవించింది.

ఎస్పీని కలిసి న్యాయం చేయాలని...

తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీసులు ఎలాగూ న్యాయం చేయరని భావించి తాజాగా జిల్లా ఎస్పీగా వచ్చిన తుషార్‌డూడిని ఇటీవలే కలిసి జరిగిన ఘోరంపై బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆయన వెంటనే దీనిపై విచారణ చేయాలని పలమనేరు సీఐ మురళీమోహన్‌కు అప్పజెప్పారు. సంఘటన జరిగింది తన పరిధి కాదని బంగారుపాళెం సీఐని కలవాలని ఆయన చెప్పారు. దీంతో బాధితురాలు బంగారుపాళెం సీఐని కలిసింది. ఆ కానిస్టేబుల్‌కు అధికార పార్టీ అండదండలు ఉండడం, నిందితుడు పోలీసు కావడంతో అప్పట్లో ఎఫ్ఐఆర్ వేయకుండా కాలయాపన చేశారు. ఎస్పీని కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన చెందిన బాధితురాలు బుధవారం చిత్తూరులో ప్రెస్‌మీట్ పెట్టి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. విషయం మీడియాకు చేరడంతో వెంటనే స్పందించిన పోలీసులు బుధవారమే ఎఫ్ఐఆర్ వేశారు. ముందే ఎందుకు కేసు నమోదు చేయలేదనే ప్రశ్న ఇప్పుడు అందరిలో వినిపిస్తోంది. పోలీసులకైతే ఓ న్యాయం సామాన్యులకైతే మరో న్యాయమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా కొందరు కానిస్టేబుళ్ల కారణంగా మొత్తం పోలీసు వ్యవస్థకే ప్రజల్లో నమ్మకం లేకుండా పోతోంది. దీనిపై జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ అయినా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బిడ్డలతో సహా ఆత్మహత్య చేసుకోవాలని...

భర్త వదిలేయడం, న్యాయం కోసం వెళ్తే ఓ కానిస్టేబుల్, హోంగార్డు లైంగిక వేధింపులతో బతకడం ఇష్టంలేక మొగిలి సమీపంలోని దేవరకొండలో ఆలయం వద్ద ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకొని రెండునెలల కిందట వెళ్లింది. కొండపైకి గస్తీ కోసమెళ్లిన బంగారుపాళెం పీఎస్‌కు చెందిన ఇరువురు కానిస్టేబుళ్లు బాధితురాలిని చూసి అడవిలో ఎందుకున్నట్టని ఆరా తీశారు. తనది పలమనేరని చెప్పగా తెలిసినవారెవరైనా ఉన్నారా అనగానే మీ కానిస్టేబుళ్లనే అడగడంటూ ఆమెను వేధిస్తున్న కానిస్టేబుల్ నంబరు ఇచ్చింది. దీంతో వారు అతడికి కాల్ చేయగా ఆమె తనకు తెలుసునని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. దీన్ని అదునుగా భావించిన ఆ కానిస్టేబుల్ ఓ కారులో ఇక్కడికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. ఆత్మహత్య చేసుకోవడం కరెక్ట్ కాదని సముదాయించి పిల్లలతో పాటు బాధితురాలికి మద్యం కలిపిన కూల్‌డ్రింక్ బాటిళ్లను ఇచ్చి వారు మత్తులో ఉండగా పిల్లలను కారులో పడుకోబెట్టి బాధితురాలితో పాటు కొండపైనుంచి కిందికి వస్తూ అడవిలోని మరో దారిలోకి తీసుకెళ్లి అక్కడ బాధితురాలిపై లైంగిక దాడి చేసినట్టు తన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. జరిగిన విషయంపై ఎవరికైనా చెబితే ప్రాణాలతో ఉండరని బెదిరించడంతో బాధితురాలు ఏం చేయలేకపోయింది.

అధినేతతో జిల్లా నేతలు



తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన ఆర్‌కే రోజా, నారాయణస్వామి, జిల్లా నేతలు ... జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి, జీడీ నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు సమన్వయకర్తలు కృపాలక్ష్మి, విజయానందరెడ్డి, సునీల్ కుమార్

ఆగని ఏనుగుల దాడులు

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు వద్ద ఏనుగుల నివారణ కోసం కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగులను తెప్పించిన గ్రామంలోనే దాడులు తప్పడంలేదు. ఆ మేరకు రెండు ఏనుగులు మంగళవారం రాత్రి మొసలిమడుగు గ్రామానికి చెందిన పిచ్చాండి, క్రిష్ణప్ప అనే రైతులకు చెందిన పొట్ట దశలోని వరి పొలాన్ని తొక్కినాశనం చేశాయి. పొలాలవద్దనున్న అరటి చెట్లను ఆరగించాయి. ఏనుగుల ఘీంకారాలతో ఇళ్ల వద్దనున్న కుక్కలు మొరగడంతో పొలాల వద్ద నివాసం ఉంటున్న యుగంధర్‌నాయుడు, సుబ్రమణ్యం అనే రైతులు ప్రాణ భయంతో అక్కడి నుంచి పరుగులు తీసి ప్రాణాలకు కాపాడుకున్నట్లు తెలిపారు.

పులిచెర్ల (కల్లూరు) : మండలంలోని గొరిశెట్టివారిపల్లె, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఏనుగులు పొలాల్లోకి ప్రవేశించి పంట నష్టం చేశాయి

ఆదిశక్తి అలంకరణలో వరాలతల్లి



పార్వతీదేవి అలంకారంలో బోయకొండ అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం అమ్మవారు ఆదిశక్తి పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం విశేషాభరణాలతో పార్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేదపండితులు గోవర్ధనశర్మ, తదితర అర్చక బృందం ఉత్సవమూర్తి ఎదుట ఈఓ ఏకాంబరం, ఉభయదారులతో కలిసి హోమ పూజలు చేశారు. కార్యక్రమానికి జీఆర్ఎస్‌రమణ (బోయకొండ), ఎం. వేణుగోపాల్‌రెడ్డి, సుగుణ (తిరుపతి) రామచంద్రయ్య, క్రిష్ణవేణి (సోమల) గురుప్రసాద్, గుణనేత్ర (బెంగళూరు) రాఘవేంద్ర, మమత (చిక్‌బల్లాపురం) చంద్రశేఖర్‌రెడ్డి,దుర్గ (రామాపురం వైఎస్సార్ కడప) వారు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు, ఊంజల్‌సేవ, హోమం, చండీ హోమం, పూర్ణాహుతి చేశారు.

కాయకష్టమే!

ప్రకృతి ప్రకోపానికి తోడు ప్రభుత్వ ప్రోత్సాహం లేక వేరుశనగ రైతులు విలవిల్లాడుతున్నారు. వేల రూపాలు పెట్టుబడి పెట్టినా దిగుబడి నామమాత్రంగా కూడా లేకపోవడంతో 'కాయ' కష్టమే మిగిలిందని నిట్టూర్చుతున్నారు. దీనికితోడు గత ఏడాది పంట నష్టపరిహారమూ అందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోకుంటే చావే శరణ్యమని గగ్గోలు పెడుతున్నారు.

- జిల్లాలో గణనీయంగా తగ్గిన వేరుశనగ దిగుబడి
- పెట్టుబడీ రాదంటూ రైతుల విలవిల
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



వేరుశనగ పంట నూర్పిడి దృశ్యం

కాణిపాకం: ఖరీఫ్‌లో ప్రతి ఏటా జిల్లాలో వర్షాధార పంటగా వేరుశ నగను రైతులు విత్తుతుంటారు. ఈసారి ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 80 వేల హెక్టార్లు కాగా.. వేరుశనగ పంట సాధారణ విస్తీర్ణం 35,238 హెక్టార్లుగా అధికారులు లెక్కలుగట్టారు. ప్రభుత్వం 30,283 క్వింటాళ్ల కాయలు సరఫరా చేసింది. ఒక్కో రైతుకు ఒక్కో బ్యాగు కాయలు ఇచ్చారు. మిగిలిన కాయలు ఏమయ్యాయో దేవుడుకే ఎరుక. దీనికారణంగా 4,092 హెక్టార్లల్లో మాత్రమే వేరుశనగ సాగులోకి వచ్చింది. వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ ప్రోత్సాహం, విత్తనాలు పూర్తి స్థాయిలో అందక పోవడంతో చాలామంది రైతులు వేరుశనగ సాగుపై ముఖం చాటేశారు.

తడి ఆరిన ఆశలు!

జిల్లాలో 10 నుంచి 15 శాతం మంది రైతులు వేరుశనగ విత్తారు. జూన్, జూలై నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో పంట ఎండుముఖం పట్టింది. తర్వాత అదునుకు తగ్గ వర్షాలు లేవు. ఇది పంట దిగుబడిపై ప్రభావం చూపింది. ఊడలు దిగే సమయంలో కూడా వర్షం కరుణించకపోవడంతో రైతుల చేతికి తీగలు మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు పంట ఒబ్బిడికి ప్రయోజనకరంగా మారాయి.

పరిహారం ..పరిహాసం!

2024 ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టార్లు కాగా 13,044 హెక్టార్లల్లో పంట సాగులోకి వచ్చింది. అయితే వర్షం కరుణించకపోవడంతో పూర్తిగా దెబ్బతింది. పరిశీలనకు దిగిన వ్యవసాయ శాఖ అధికారులు 9వేల హెక్టార్లల్లో మాత్రమే పంట దెబ్బతిన్నట్లు నివేదికలు పంపారు. 24,342 మంది రైతులకు గాను రూ.15.42 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు తేల్చారు. గుడిపాల, పెనుమూరు, యాదమరి మండలాలను అత్యంత కరువు మండలంగా ప్రకటించారు. మరో 13 మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో జనవరి 8వ తేదీన కేంద్ర బృందం యాదమరి, గుడిపాల మండలాలను సందర్శించింది. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులతో ముఖాముఖి నిర్వహించింది. అయితే నష్టపోయిన రైతులకు పరిహారం ఇంతవరకు ఇవ్వకపోవడంపై పలువురు మండిపడుతున్నారు.

ఒబ్బిడిలో రైతులు బిజీబిజీ



వేరుశనగ ఒబ్బిడిలో రైతులు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వేరుశనగ ఒబ్బిడిలో బిజీబిజీగా మారారు. అయితే దిగుబడి చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. చెట్టుకు రెండు గట్టి కాయలు కూడా లేకపోవడంతో పెట్టుబడిపై పూర్తిగా ఆశలు వదులుకుంటున్నారు. ఎకరాకు 15 బ్యాగులకుగాను (బ్యాగుకు 40 కేజీలు) రెండుమూడు బ్యాగులు కూడా వచ్చేపరిస్థితి లేదని రైతులు నిట్టూర్చుతున్నారు. 3 శాతం మంది రైతులు మాత్రం బోర్ల కింద పంటను కాపాడుకోగలిగారు.

కాయలు లేవు



నేను 1.5 ఎకరాల్లో వేరుశనగ వేశా. పెట్టుబడి 30 వేలు అయ్యింది. ఐదు బ్యాగుల కాయలకే 10 వేల దాకా పెట్టా. ప్రభుత్వం ద్వారా ఒక్క బ్యాగు కాయలు మాత్రమే ఇచ్చారు. కొంతమంది సాయంతో నాలుగు బ్యాగుల కాయలు సంపాదించా. వేస్తే చెట్టుకు గట్టి కాయలు రెండు కూడా లేవు. పెట్టిన పెట్టుబడి కూడా రాదు. గతేడాది కూడా పూర్తిగా నష్టపోయాం. ఇంత వరకు పరిహారం ఇవ్వలేదు. ఈ ఏడాది కూడా నష్టపోయాం. ప్రభుత్వం పరిహారం ఇస్తే రైతులు కోలుకుంటారు. –పట్టాభి, పాలూరు, చిత్తూరు మండలం

శుభలేఖ ఇస్తామని పిలిచి చితకబాదారు

- ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయం
- పాత కక్షలతోనే దాడిచేయించారని ఫిర్యాదు



వీపుపై కర్రలతో చితక బాదడంతో గాయాలైన దృశ్యం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేష్

చౌడేపల్లె : ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయమైన స్నేహితుడికి తన వివాహపు శుభలేఖ ఇవ్వాలని, పిలిచి కట్టెలతో చితకబాదిన ఘటన బోయకొండ మార్గంలోని మిట్టూరుకు వెళ్లే కూడలిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుదిపట్ల పంచాయతీ మిట్టూరుకు చెందిన గణేష్ (22) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నిమ్మనపల్లె మండలం పితావాండ్లపల్లెకు చెందిన సతీష్‌తో గతేడాదిగా ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయమయ్యాడు. వీరిద్దరూ స్నేహితులు కావడంతో బుధవారం తన పెళ్లని శుభలేఖ ఇవ్వాలని బోయకొండ మార్గంలోని మిట్టూరు కూడలిలో ఉన్నానని త్వరగా రా.. నేను మళ్లీ వెళ్లాలంటూ ఫోన్ చేశాడు. ఇంటి వద్ద ఉన్న గణేష్ అతడితో పాటు నాగార్జున కలిసి బైక్‌పై వెళ్లారు. సతీష్‌తోపాటు మరో 8 మంది కలిసి గణేష్ చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని వెంట తెచ్చుకొన్న కర్రలతో మూకుమ్మడిగా కలిసి చితకబాదారు. కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు అక్కడికి చేరుకొని అడ్డుకొనే ప్రయత్నం చేసినప్పటికీ దారుణంగా చితకబాదారన్నారు. హతమార్చడానికే వారువచ్చారని అదే గ్రామానికి చెందిన గోపాల్‌తో తనకు పాత కక్షలున్నాయని అతడే ఈ దురాగతానికి పాల్పడ్డారని, అతను కూడా ఘటనా స్థలంలోనే ఉన్నాడని ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అతడిని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రైవేటు బస్సు బోల్తా

- బెంగళూరుకు చెందిన 22 మందికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

పూతలపట్టు (యాదమరి) : పూతలపట్టు మండలం పాలమూరు సమీపంలో బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటనలో 22 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు... బెంగళూరు నుంచి తిరుపతి వైపుగా 40 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో అతి వేగంతో ప్రయాణిస్తున్న బస్సు పూతలపట్టు మండల పరిధి పాలమూరు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వెళ్తున్న ఓ ఐచర్ వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మొత్తం 22 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో బెంగళూరుకు చెందిన హైమ, పుష్పవతి, సౌభాగ్య, భారతి, దివ్యశ్రీ, సంపూర్ణ, లత, సునిత, లక్ష్మి, లీలావతి, మునిరాజ్, సాంసన్, వెంకటరమణ, అరుణ్‌కుమార్, ఉదయ్, మునిసోమేష్, సంజన్, కృష్ణమూర్తి, లవ, మోహిత్‌రావు, శ్రీనివాసులు, వినయ్ ఉన్నారు. గాయపడ్డవారిని స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడ్డ ప్రయాణికులు

'నా భూమిని లాక్కున్నారు..న్యాయం చేయండి'



బాధితురాలు భూమిలోకి వెళ్లకుండా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

పలమనేరు : తన భూమిని పరిశ్రమల కోసమంటూ రెవెన్యూ అధికారులు అన్యాయంగా స్వాధీనం చేసుకున్నారని తనకు న్యాయం చేయాలంటూ పట్టణానికి చెందిన రాజేశ్వరి అనే బాధితురాలు మీడియాను ఆశ్రయించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగమంగళం రెవెన్యూలో రాళ్లు, చెట్లతో ఉన్న మూడెకరాల పొలాన్ని రాజేశ్వరి కుటుంబీకులు వ్యవసాయ యోగ్యంగా మార్చుకుని 30 ఏళ్లుగా వర్షాధారిత పంటలను సాగు చేసుకుంటున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు 2005లో డీకేటీ పట్టాను మంజూరు చేశారు. ఇందుకు పట్టాదారుపాసు పుస్తకాలను మంజూరు చేయాలని బాధితురాలు పలు దఫాలు స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. అయినా ఇవ్వకపోవడంతో బాధితురాలు 2023లో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల సైతం ఇక్కడి అధికారులు పట్టించుకోలేదు. ఈ భూమిని పరిశ్రమల స్థాపనకోసం ప్రభుత్వం తీసుకుంది. దీనిపై బాధితురాలు బుధవారం భూమి వద్దకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరగా ఇది ప్రభుత్వం ఇచ్చిన స్థలమంటూ ఎలాంటి హక్కులేదంటున్నారని బాధితురాలు వాపోయింది.

అభివృద్ధితో పాటు వసతుల కల్పన

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు మౌలిక వసతులు, సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం చిత్తూరు నగరంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్.. గాంధీ రోడ్డులో రోడ్డు విస్తరణ పనులు, కట్టమంచిలో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులు, దొడ్డిపల్లెలోని హౌసింగ్ లే–అవుట్ పనులను చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కమిషనర్, ఆర్డీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సుబ్రమణ్యం, ఈఈ శంకరప్ప, డీఈ శ్రీధర్, చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్‌తో కలిసి పరిశీలించారు. కట్టమంచి వై జంక్షన్ నుంచి మురగానపల్లి వరకు (మైదా ఫ్యాక్టరీ రోడ్డు) బీటీ రోడ్డు పనులు వేగవంతం కావాలన్నారు. వచ్చే వారం లోపు జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలన్నారు.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి

- దర్జాగా అక్రమ రవాణా
- రాత్రి పూటే తరలింపు
- కూటమి నేతలకు అధికారుల అండ



చౌడేపల్లె : కోటూరు వద్ద రాత్రిపూట ఎర్రమట్టి గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న దృశ్యం



తోటకురప్పల్లెవద్ద అడ్డ గుట్టను తవ్వి మట్టిని తరలిస్తున్న దృశ్యం

టాస్క్‌ఫోర్స్ : చౌడేపల్లి మండలంలోని చెరువుల్లో మట్టి, ఇసుక డంప్ చేసినా అధికారులకు కనపడడం లేదు. రెవెన్యూ , నీటిపారుదల , పోలీసులు, రవాణా శాఖ అధికారులు తెలిసినా నోరు మెదపడం లేదని స్థానికుల నుంచి తీవ్ర విమర్శలున్నాయి. జేసీబీ, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా రాత్రిపూట అక్రమంగా రవాణా చేస్తున్నా అడిగే నాథుడే కరవయ్యారు. రాత్రిపూట ప్రభుత్వ స్థలాల్లోని ఎర్రమట్టిని జేసీబీతో పెకలించి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా రవాణా సాగిస్తున్నారు. ఒక లోడు ఎర్రమట్టి రూ.600 నుంచి దూరాన్ని బట్టి రూ.750 వరకు తీసుకుంటున్నారు. ఎర్రమట్టి కనిపిస్తే చాలు జేసీబీలు పెట్టి తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై కూటమి నేతలు బెదిరిస్తున్నారు.

గుట్టను చదును చేస్తున్నా...

పెద్దకొండామర్రి పాలింపల్లె వద్ద ఇమాంసాబ్‌కు చెందిన పొలంలో రాత్రిపూట గ్రావెల్ తీస్తుండగా సమాచారం తెలుసుకొని అడ్డుకొని వాహనాలను వెనక్కు పంపారు. చెడుగుట్ల పల్లె సమీపంలోని మనుకూరమ్మ గుట్ట వద్ద గల ప్రభుత్వ స్థలాలు, గుట్టలోని ఎర్రమట్టిని సైతం వదలడంలేదు. శెట్టిపేట పంచాయతీ తోటకురప్పల్లె వద్ద గల అడ్డ గుట్ట అటవీ స్థలంలో ఎర్రమట్టిని దర్జాగా తరలిస్తూ గుట్టనే చదును చేస్తున్నా అటవీశాఖ అధికారులు నోరు మెదపడం లేదు. చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడంలేదు.

ఇసుక దంప్‌లున్నా ఉదాసీనతే..

అక్రమార్కులకు ఇసుక కాసుల వర్షం కురిపిస్తోంది. ఇసుకను డంప్ చేయడం విరుద్దమని తెలిసినా డంప్ ఉన్నప్పటికీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం విమర్శలు చెలరేగుతున్నాయి. ట్రాక్టర్ ద్వారా రూ.5 నుంచి రూ. 6 వేల చొప్పున గ్రామాల్లో విక్రయిస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.